


# ఐకమత్యమే...

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాద్

మానస సరోవర ప్రాంతంలో కొక్కిరాయి అనే కొంగ, మరాళము అనే హంస స్నేహంగా వుంటుండేవి. ఏ పొరపొచ్చాలు లేకుండా కలసి మెలసి ఉండే అవంటే ఇతర జీవులకీ ఎంతో అభిమానం. వాటి స్నేహాన్ని కథలు కథలుగా చెప్పుకునేవి.

ఇదిలా వుండగా అక్కడి సరస్సులో ఉండే తాబేలు చిన్నికి, చేప మీనవాణికి వాగ్వివాదం వచ్చింది. అదేమిటంటే -

పొడవైన కాళ్ళతో, మెడతో కొంగ అందంగా వుంటుందనీ, కొంగముందు హంస మరుగుజ్జు అని చిన్ని వెటకారం చేసింది. అది విన్న మీనవాణి "నీ ముఖం హంస పాలను, నీళ్ళను వేరు చేసే అద్భుత శక్తి కలిగి వుంటుంది. దాని నడక ఎంతో అందంగా వుండి కవుల చేత రాయంచ నడక అని కావ్యాలు రాయించుకుని పొగిడించుకుంటుంది. అసలు హంసకి కొంగకి పోలికేవిటి?" అని కసురుకుంది. కొంతసేపటికి ఆ



రెండూ ఒక అంగీకారానికి వచ్చాయి. - అదేమిటంటే కొంగ, హంసల దగ్గరకి వెళ్ళి ఆ రెంటిలో ఏది గొప్పదో అవే తేల్చుకుని చెప్పాలని.

చిన్నీ, మీనవాణి తమ పోట్లాట మొత్తం కొక్కిరాయి, మరాళములకు వినిపించి, చివరగా మీ ఇద్దరిలో ఎవరుగొప్ప అన్నది తేల్చి చెప్పాలన్నాయి.

ఆ మాటలు విని కొక్కిరాయి, మరాళము పెద్దగా నవ్వి, ''మీ అమాయకత్వానికి, అజ్ఞానానికి మాకు నవ్వు వస్తోంది. ఈ సృష్టిలో వున్న యావత్ జంతుజాలం అందమైనదే, ఉపయోగపడేదే. దేని ప్రత్యేకత దానికుంటుంది. ఇప్పుడు చూడు కొంగకి పొడవైన మెడవుంది. అది చేపని ఇట్టే పట్టుకోగలదు. దాని కాళ్ళు పొడుగు అది నీటిలో ఎంత దూరమైనా నడిచి వెళ్ళి ఆహారం తెచ్చుకోగలదు" అని హంస అంటే, "మరి హంస సొగసరి, చూపరుల కళ్ళను కట్టి పడేయగలదు. హంసలను చూడ్డానికే ఎంతో ఇక్కడకి వచ్చి మనని మచ్చిక చేసుకుంటారు" అని కొంగ అంది. అందుచేత గొప్పతనమన్నది ఏ ఒక్కదాంట్లోనూ ఉండదు. అది చూసే చూపుని బట్టి వుంటుంది. కలహించుకోకుండా కలసి మెలసి ఉండటంలోనే ఆనందం ఉంటుంది. అలాగే మనం కావాలని కోరుకుని ఇలా జన్మించలేదు. సృష్టి మనని ఇలా సృష్టించింది. దానికి మనం పొంగిపోకూడదు అన్నాయి.

ఆ మాటలు విన్న చిన్నా, మీనవాణీలు "నిజమే అనవసరంగా వాదులాడుకుని కాలహరణం చేసుకున్నాము. అన్ని జీవరాసుల ఐకమత్యమే సృష్టికి బలం అని తెలిసింది.. వెళ్తున్నాం మిత్రలారా" అని బుడుంగన నీటిలోకి మునిగాయి.